క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్/భట్టిప్రోలు: మరమ్మతు పనుల నేపథ్యంలో ఈ నెల 14వ తేదీ సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రేపల్లె మండలంలోని పేటేరు, మోర్లవారిపాలెం, గంగడిపాలెం, పోటుమెరక, బొబ్బర్లంక, పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, చోడాయపాలెం, కైతేపల్లి, తుమ్మల, నిర్మల్ నగర్, మోళ్లగుంట, రాజుకాలువ, లంకెవానిదిబ్బ గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఆశాఖ రూరల్ ఏఈ ఏడుకొండలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భట్టిప్రోలు మండలంలో..

భట్టిప్రోలు మండలం పెదపులివర్రు సబ్ స్టేషన్ పరిధిలోని రూరల్ గ్రామాల్లో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగుతుందని ఇన్‌ఛార్జ్ ఏఈ ఎం.శాంతకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గొరిగపూడి, కన్నెగంటివారిపాలెం, ఓలేరు గొడపాలెం, పాత దళితవాడ, తూర్పుపాలెం గ్రామాల్లో విద్యుత్ సరపరా ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో మెయిన్‌టెనెన్స్ పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాబాకు పువ్వులతో అర్చన



రేపల్లె రూరల్: సాయిబాబా సమాధి కార్యక్రమాన్ని పట్టణంలోని రైలుపేట సాయిబాబా ఆలయంలో శనివారం నిర్వహించారు. బాబా సమాధిని పువ్వులతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులు సాయి చాలీసా పారాయణం, సాయి నామం జపంతో పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



చెరుకుపల్లి: దసరా ఉత్సవాల్లో భాగంగా గుళ్ళపల్లి గ్రామంలోని శ్రీ గంగాంబికా సమేత ఆనందీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి దాతలు వెండి కిరీటం బహూకరించారు. మండలంలోని గుళ్ళపల్లి గ్రామానికి చెందిన వాగు బ్రహ్మయ్య అనే భక్తుడు 450 గ్రాముల బరువు గల వెండితో తయారు చేసిన రూ.45 వేలు విలువ కలిగిన కిరీటాన్ని ఆదివారం ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యన్నారాయణకు ఆలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సందర్భంగా సత్యనారాయణ, ఆలయ చైర్మన్ ఓగిరాల వీరాస్వామి కమిటీ సభ్యులు బ్రహ్మయ్యతో కలసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ప్రయాగ రాంబాబు పాల్గొన్నారు.

బాలికలకు దుస్తులు పంపిణీ



కోనేటిపురం(భట్టిప్రోలు): దసరా పండుగ పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బాలికలకు శనివారం నూతన దుస్తులు, నోట్ పుస్తకాలు, స్టేషనరీని అందచేశారు. ఈ సందర్భంగా కోనేటిపురం గ్రామానికి చెందిన బాలికలకు బాలవికాస్ గురువు ధారా గిరిజ వీటిని అందచేశారు. కార్యక్రమంలో అర్చకులు ధారా నారాయణమూర్తి, విగ్రహ కమిటీ నిర్వాహకులు చిట్టిబొమ్మల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపల్లె తీర అభివృద్ధిపై శ్రద్ధ పెట్టండి

నిజాంపట్నం: రేపల్లె తీర ప్రాంత అభివృద్ధిపై కూటమి నేతలు శ్రద్ధపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. మండలంలోని బొర్రావారిపాలెం గ్రామంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నిజాంపట్నం పోర్టును అభివృద్ధి చేయాలన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

తాడికొండ: మద్యం సేవించిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మృతి చెందిన ఘటన తుళ్లూరు అయ్యన్న చెరువు ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సూరపు రామకృష్ణ (36) అనే వ్యక్తి కొంత కాలంగా తుళ్లూరు మండల పరిధిలో స్లాబ్ కాంక్రీట్ పనులు చేస్తూ.. అక్కడే నివాసం ఉంటున్నాడు. 12న మద్యం సేవించి అయ్యన్న చెరువులో ప్రమాదవ శాత్తు జారిపడి మునిగిపోయాడు. స్థానికులు కాపాడేందుకు యత్నించినా ఫలితం లేక పోయింది. మేస్త్రీ బురుసు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

మూషికాసురుల దండయాత్ర

వరిని కొట్టేస్తున్న ఎలుకలు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు
- గతంలో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా నివారణ
- బుట్టలు పెట్టేవారిని ఆశ్రయిస్తున్న రైతులు
- ప్రయోజనం ఉండడం లేదని ఆవేదన



వేమూరులోని ఓ పొలంలో ఎలుకల బుట్టలు పెట్టుతున్న దృశ్యం

వేమూరు: ఖరీఫ్ సీజన్‌లో వరిచేలపై ఎలుకలు దండయాత్ర చేస్తున్నాయి. చిరు పొట్టదశలో ఉన్న పంటను కొట్టేస్తున్నాయి. ఫలితంగా భారీగా నష్టం వాటిల్లుతోంది. అయినా వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో 95 వేల ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగైంది. ఎలుకల వల్ల రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎలుకల బొరియలు తవ్వించి బుట్టలు పెట్టడం, ఎలుకల మందు వాడడం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎలుకలు బుట్టలు పెట్టడానికి ఎకరానికి రూ.600 ఖర్చుచేయాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇదిలా ఉంటే గతంలో ప్రభుత్వం ఎలుకల నివారణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టేది. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సూచనలు, సలహాలు అందించేవారు. ఎలుకల నివారణ మందు ఉచితంగా పంపిణీ చేసి ఎలా పెట్టాలో చెప్పేవారు. సామూహికంగా ఈ కార్యక్రమం చేపడితే సత్ఫలితాలు ఉంటాయని వివరించేవారు. అయితే ఇప్పుడు వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదు.

రేపటి నుంచి సామూహిక నివారణ కార్యక్రమం

ఈ నెల 15 మంగళవారం నుంచి సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపడతాం. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఎలుకల నివారణ మందులు పంపిణీ చేస్తాం

–చందోలు సునీత, మండల వ్యవసాయాధికారి, వేమూరు

నివారణ మందు ఏదీ!



గతంలో వ్యవసాయాధికారులు ఎలుకల నివారణ మందులు పంపిణీ చేసేవారు. ఇప్పుడు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. గతేడాది కూడా ఎలుకల మందు, నూకలు, నూనె కలిపిన మిశ్రమం ఎలుకల నివారణకు పంపిణీ చేశారు. నేను పది ఎకరాల్లో సాగు చేస్తున్నా. ఎలుకల బెడద అధికంగా ఉంది. ఏం చేయాలో పాలుపోవడం లేదు.

– వేమూరు జక్రయం, రైతు, వేమూరు

ఎలుకల బెడద ఎక్కువగా ఉంది



వరహాపురం గ్రామంలో 3 ఎకరాలు వరి పంట సాగు చేశాను. వరి చిరు పొట్ట దశలో ఉండటం వల్ల ఎలుకలు అధికంగా వరి పంటను కొట్టి వేస్తున్నాయి. ఎలుకల నివారణకు బుట్టలు పెట్టిస్తున్నా. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి.

– ఈపూరు యోహాను– వరహాపురం, వేమూరు మండలం

వైభవంగా విజయదశమి

విజయదశమి ఉత్సవాలు ముగిశాయి. శనివారం దసరా పండగా సందర్భంగా ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. తొమ్మిది రోజులపాటు వివిధ అలంకారాల్లో ప్రత్యేక పూజలు అందుకున్న అమ్మవారు శనివారం రాజరాజేశ్వరిదేవిగా కటాక్షించారు. పలుచోట్ల అమ్మవారి విగ్రహాల నిమజ్జనోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా లడ్డూల వేలం కార్యక్రమాలు కోలాహలంగా సాగాయి.

–భట్టిప్రోలు/వేమూరు/బాపట్ల/రేపల్లెరూరల్/చెరుకుపల్లి/నగరం



భట్టిప్రోలు మండలం వేమవరంలో ప్రత్యేక అలంకారంలో పాండురంగస్వామి



చుండూరు మండలం చినపరిమి గ్రామంలో అమ్మవారి ఊరేగింపు



వెల్లటూరు కట్లమ్మ తల్లి దేవాలయంలో నవదుర్గ పూజ



ఐలవరంలో కనకదుర్గమ్మ అమ్మవారి లడ్డూను కైవసం చేసుకున్న భక్తుడు



ఈదుపల్లిలో కనకదుర్గమ్మ ఊరేగింపు



రేపల్లెలో పూజలందుకుంటున్న గ్రామదేవత బూరుగులమ్మ



బాపట్లలో ప్రత్యేక పూజలు



ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆయుధ పూజలు



గుళ్ళపల్లిలో శమీ పూజ



చెరుకుపల్లి బాలకోటేశ్వర స్వామి గుడిలో రాజరాజేశ్వరిదేవిగా..

16న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కర్లపాలెం: దుండివారిపాలెం గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 16న ఉదయం 7.57 గంటలకు నిర్వహించనున్నట్టు గ్రామపెద్దలు తెలిపారు. సోమవారం విఘ్నేశ్వర పూజ మంగళ స్నానం గ్రామోత్సవం నిర్వహిస్తామని, 15వ తేదీన జలాదివాసము, వాస్తు హోమము, వాస్తు బలి, దిశ హోమము విశేష పూజలు జరుగుతాయని తెలిపారు. 16న విగ్రహ ప్రతిష్ఠ అనంతరం భక్తులకు అన్న సంతర్పణ ఉంటుందని వివరించారు.

12 మద్యం దుకాణాలకు 198 దరఖాస్తులు

వేమూరు: వేమూరు నియోజక వర్గంలోని 12 మద్యం షాపులకు 198 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సీఐ రవి కుమార్ తెలిపారు. ఈనెల 11న వైన్స్ షాపులకు దరఖాస్తు గడువు ముగిసిందని వివరించారు. . వేమూరు మండలంలోని మూడు వైన్స్ షాపులకు 64, అమర్తలూరులో రెండు షాపులకు 35 దరఖాస్తులు వచ్చినట్టు వివరించారు. చుండూరు మండలంలోని మూడు షాపులకు 59 దరఖాస్తులు అందినట్టు చెప్పారు. కొల్లూరు మండలంలోని నాలుగు షాపులకు 56 దరఖాస్తులు అందినట్టు వెల్లడించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో షాపులకు డ్రా తీస్తారని, 16 నుంచి కొత్త మద్యం విధానం అమలులోకి వస్తుందని వివరించారు.

జూదరుల అరెస్టు

అమర్తలూరు(వేమూరు) : పేకాట ఆడుతున్న జూదరులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఆమర్ వర్ధన్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ 4,040 స్వాదీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం



తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులో క్లాసిక్ స్పోర్ట్స్ ఎరీనా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం సాయంత్రం పట్టణానికి చెందిన వైద్యుడు, మైత్రీ హాస్పటల్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆలపాటి కృష్ణసందీప్ ప్రారంభించారు.ఈ టోర్నమెంటు 13, 14, 15 తేదీల్లో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15 వేలు, రూ.8 వేలు, 4 వేలు, మాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రతి టీమ్‌కు రూ.వెయ్యి ఇస్తామని తెలియజేశారు. షేక్ షమీర్, షేక్ అమిర్ సోహెల్, షేక్ అమిర్ షకీల్, మావులూరి రేవంత్, షేక్ సమీర్, తరుణ్, అక్షయ్, చాణక్య తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి ఉచిత దంత వైద్య పరీక్షలు

కర్లపాలెం: దేవీ శరన్నవరాత్రులలో భాగంగా అమ్మవారికి 9రోజుల పాటు పూజలు నిర్వహించటంతో పాటు ముగింపు సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు చెప్పారు. స్థానిక పెద్దింటమ్మ కల్యాణ మండపంలో సింగరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించి రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం అన్నదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలలో భాగంగా ప్రతి సంవత్సరం దంత వైద్య శిబిరం ఏర్పాటు చేయటం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. శిబిరంలో బాపట్లకు చెందిన ప్రముఖ దంత వైద్యుడు హనుమంతరావు సుమారు 100మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి దంతక్షయం నివారణకు సూచనలు, సలహాలు ఇచ్చి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరాజు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కృష్ణంరాజు, టి.శ్రీనివాసరావు, సత్యనారాయణరాజు, మంతెన కృష్ణంరాజు, సాంబయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



పెద్దింటమ్మ ఆలయ ప్రాంగణంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

గ్రాడ్యుయేట్ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోండి

వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్

రేపల్లెరూరల్: గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరు గణేష్ కోరారు. చెరుకుపల్లి మండలం కనగాల గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2025 మార్చిలో కృష్ణా–గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఫారం–18లో తమ వివరాలను నమోదు చేసి, ఫారంతో పాటు డిగ్రీ సర్టిఫికెట్, పాస్‌ఫోటో, ఆధార్‌కార్డు జిరాక్స్, ఓటరు, రేషన్‌కార్డుల నకళ్ళను జత చేసి తమ సమీపంలోని తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలని పేర్కొన్నారు.



కనగాలలో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఈవూరు గణేష్

పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు

తెనాలిఅర్బన్: విజయదశమిని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం డిపో సెంటర్‌లో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, చినరావూరు పార్కులో పనిచేసే వారికి నూతన వస్త్రాలు, బిర్యానీ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న 34వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, జనసేన నాయకులు జిడుగు తులసీలు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నుంచి గుంటూరు కోటేశ్వరరావు మున్సిపల్ కార్మికులు 60 మందికి వీటిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కుక్కల వాసు, సురుపుల వెంకట్రావు, సుంకర కొండలరావు, మేడేపల్లి ప్రభాకర్, ధరణికోట మల్లిఖార్జునరావు, శివారెడ్డి, రాజా, మనోజ్, బాబి, తోట ఫణి, మామిడాల సుమన్, 15వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



16 నుంచి పంచాయతీ వారోత్సవాలు

భట్టిప్రోలు: ఈనెల 16 నుంచి పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎస్‌వీ రమణ ఆదివారం తెలిపారు. ఈ నెల 16,18 తేదీలలో భట్టిప్రోలు మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఆమోదించిన కొత్త పనులకు శంకుస్థాపనలు జరుగుతాయని వివరించారు. 16న అల్లమూడి, పల్లెకోన, సూరేపల్లి, రాచూరు, 18న చింతమోటు, పెదపులివర్రు, ఓలేరు, వెల్లటూరు గ్రామాలలో సభలు జరుగుతాయని వెల్లడించారు.

రోడ్డుపై విరిగి పడిన చెట్టు



అమర్తలూరు(వేమూరు) అమర్తలూరు మండలంలోని మండూరు వంతెన సమీపంలో చెట్టు విరిగి అర్ అండ్ బీ రోడ్డుపై పడింది. దీంతో ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలిగింది. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోలేదు. తక్షణం చెట్టును తొలగించాలని స్థానికులు కోరారు.

నీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

బాపట్ల కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల: నీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో ఆదివారం ఆయన సమీక్షించారు. మంచి నీటి ట్యాంకర్ల రికార్డులను పరిశీలించారు. ఉద్యోగుల హాజరుపట్టిని పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. పట్టణంలోని పెయింటర్స్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, ప్యాడిసన్ పేట, ఇందిరా నగర్ కాలనీ, రాజీవ్ నగర్, గేటుకొత్తపాలెం, గంగపుత్ర కాలనీ, బేతనీ కాలనీలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా తప్పక జరిగేలా చూడాలని తెలిపారు. వీధి దీపాలను నిరంతరం పర్యవేక్షించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. పార్కుల నిర్వహణ సిబ్బందితో మాట్లాడుతూ పార్కుల నిర్వహణలో అలసత్వం వహించకూడదని సూచించారు.



ఇంజినీరింగ్ విభాగం ఫైల్స్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

తాడేపల్లిలో ఇసుక మాఫియా

తాడేపల్లిరూరల్ : కార్మికులకు ఉపాధి కల్పించేందుకు, ప్రజలకు ఇసుక అందుబాటులోకి తెచ్చేందుకు ప్రాతూరు ఇసుక క్వారీని తెరిపించి పనులు కల్పించాలని సీపీఎం సీనియర్ నాయకుడు జొన్నా శివశంకరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరులో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో నూతన ఇసుక విధానాన్ని తీసుకు వచ్చి ఉచితంగా ఇసుకను ప్రజలకు అందజేస్తామని హామీ ఇచ్చిందన్నారు. 2004 లో ప్రాతూరు ఇసుక క్వారీ మూతపడడంతో సుమారు 400 కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లి మండలంలో ఇసుక మాఫియా అక్రమంగా క్వారీల నుంచి ఇసుకను తీసి, అమ్ముకుంటోందన్నారు. తక్షణమే ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తెచ్చి భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ట్రిబ్యునల్ కోర్టు తీర్పు ఆధారంగా భూగర్భ జలాలు ఇంకిపోకుండా, కార్మికులతోనే క్వారీలలో పని చేయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం నూతన శాఖ కార్యదర్శిగా డోకిపర్తి రాజేంద్రబాబును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ నాయకులు డోకిపర్తి కోటయ్య, తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, గ్రామ సీపీఎం నాయకులు దాసరి సురేష్ పాల్గొన్నారు.



ఇండియా పోస్ట్ 5కే రన్

లక్ష్మీపురం: గుంటూరులో తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఇండియా పోస్ట్ రన్ –2024 కార్యక్రమంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ప్రజా ప్రతినిధులతో కలసి 5 కే రన్ లో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నగరంలో పారిశుద్ధ్య పనుల తనిఖీ నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో డ్రెయిన్లపై, రోడ్ల మీద ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ ఉన్నారు.

